# గాయాల చెట్లు

ఆ రోజు ఉదయమే హడావిడిగా సుకుమార్ ఊడిపడ్డాడు. టీవిల్లో ఇవ్వడానికి తీసిన అడ్వర్టయిజ్‌మెంట్‌కి సంబంధించిన సీడిని పట్టుకొచ్చాడు.

'యాడ్ బాగా వచ్చిందిరా... నీ ఆలోచన గొప్పది. యాడ్ బాగా క్లిక్కవుతుంది." అన్నాడు నా భుజాలు పట్టి కుదుపుతూ... వాడి మొహంలో ఎవరూ

తీయలేని యాడ్ తీసామన్న ఆనందం. ఆ యాడ్‌కి స్క్రిప్టు రాసిచ్చింది నేనే.

'కాకపోతే ఏనుగుల్తో షూటింగ్ చేయటం చాలా కష్టమైంది. కేరళవెళ్లి అక్కడ తర్ఫీదు పొందిన పది పన్నెండు ఏనుగులకు సంబంధించిన వివరాలు సేకరించి... అక్కడి మావటి గాళ్లకు స్క్రిప్ట్ అంతా మళయాళంలో విన్పించి... గంటసేపు షూటింగ్ చేస్తేగాని... పన్నెండు సెకండ్ల యాడ్ పూర్తి కాలేదు..." యాడ్ కోసం పడ్డ కష్టమంతా ఏకరువు పెడుతున్నాడు సుకుమార్.

"ఏంటయ్యా సుకుమార్ ఆనందంగా వున్నావ్... ఏంటి విశేషం?" అంటూ వచ్చాడు మా నాన్న. ఆయనకి డెబ్బయ్యేళ్లుంటాయి.

"ఈమధ్య కొత్త వెంచర్ ప్రారంభిస్తున్నాను అంకుల్... ఆ బిజినెస్‌కి సంబంధించిన యాడ్ చేయాలని ఆర్నెల్లనించీ ఆరాటపడుతున్నాను. చాలా మంది రచయితల్ని కలిసినా ఎవరూ సరైన స్క్రిప్ట్ ఇవ్వలేదు... ఇదిగో... వీడు గొప్ప స్క్రిప్ట్ ఇచ్చాడు. కేరళ వెళ్లి షూటింగ్ ఎడిటింగ్ చేసుకొని నిన్ననే వచ్చాను" అని చెప్పాడు.

"ఏమిటా కొత్త బిజినెస్సు... ఇప్పటికే కోట్లు సంపాదించావ్ కదయ్యా" అన్నాడు నవ్వుతూ.

"మీరే చూడండి.. ఒరేయ్ వాసూ... సీడీని ప్లే చేయి" అన్నాడు. సీడీని ప్లేయర్‌లో పెట్టి ప్లే చేసి... టీవి ఆన్ చేసాను.

పచ్చటి చెట్లు... అందమైన ప్రకృతి... వెనకనించి మంద్రంగా విన్పిస్తున్న అద్భుతమైన సంగీతం... దాదాపు పది పన్నెండు ఏనుగులు ఒక్కొక్కటిగా వచ్చి

చేరాయి. అక్కడే కూచొని వున్న ఒక వృద్ధ ఏనుగుకు దంతాలు ఊడిపోయి కింద పడిపోయి వున్నాయి. కొన్ని ఏనుగులు తొండాలు పైకెత్తి ఘీంకరించాయి. వృద్ధ ఏనుగు శరీరాన్ని సాదరంగా తొండాలతో తడిమాయి. వృద్ధ ఏనుగు బరువుగా లేచింది. ఏనుగులన్నీ తొండాలు కలిపాయి. ప్రేమగా దాని తొండాన్ని... పాదాన్ని నిమిరాయి. ఆ తర్వాత... వృద్ధ ఏనుగు భారంగా కదిలిపోయింది... మిగిలాయి తొండాలెత్తి గంభీరంగా వీడ్కోలు పలికాయి. వృద్ధ ఏనుగు అడవిలోకి వెళ్లి అంతర్ధానమవుతుంటే... వెనకనించి మాటలు విన్పించాయి...

'ఆరోసారి దంతాలు ఊడిపోయాక ఏనుగు ఏకాంత వాసానికి వెళ్లిపోతుంది. మిగితావి ఆనందంగా వీడ్కోలు చెప్తాయి... మనకూ ఆ పరిస్థితి వచ్చేసింది. అందుకే... మీకోసం... ఆధునిక సౌకర్యాల ఓల్డేజ్ హోం... ఓమ్..."

యాడ్ అయిపోయింది...

"అద్భుతంగా వచ్చిందిరా. పచ్చని కొమ్మల్లోంచి కిరణాలు పడుతుంటే... దట్టమైన మంచుపొగలోంచి ముసలి ఏనుగు వెళ్లిపోతున్న దృశ్యం. వృద్ధాశ్రమాల మీద ఇంతకన్నా డిఫరెంట్ యాడ్ ఇప్పటి వరకు రాలేదు. అద్భుతం..." ఆనందంగా చెప్పాను సుకుమార్‌తో..

"ఎలా వచ్చిందకుంల్...?" నాన్ననుద్దేశించి అడిగాడు సుకుమర్.

నాన్న ముఖం చిన్నబోయింది.

కాని.. "ఎక్కడ పెడుతున్నావ్..ఓమ్..." అని మాత్రం అడిగాడు.

"శామీర్‌పేటలో అంకుల్.. చాలా ఆధునికంగా చేస్తున్నాను. రెండేళ్లలో అన్ని జిల్లాల్లోనూ వానప్రస్థ గ్రూప్ కింద బ్రాంచీలు ఓపెన్ చేసే ఏయిమ్‌తో వున్నాను. పదికోట్లు పెట్టుబడి. ఏడాదిలో రెట్టింపు కావచ్చు. ఎందుకంటే మన దగ్గర కూడా ఎన్నారైలు ఎక్కువైపోయారు. వృద్ధులు మిగిలిపోతున్నారు" అన్నాడు.

"ఓమ్ అని ఎందుకు పెట్టావురా" అనడిగాను.

"సింపుల్... తెలుగు పదం ఓల్డేజ్ హోమ్ లోని మొదటి, చివరి అక్షరాలు తీసుకున్నా... ఆ వయసులో కావల్సింది ఆధ్యాత్మికతే కదా..." అని నవ్వాడు.

ఇంతలో మావాడు స్కూల్‌కి రెడీ అయి... 'తాతయ్యా... నేను ఆటోలో వెళ్లను. నువ్వే స్కూల్ దగ్గర దింపెయ్యి' అంటూ వచ్చాడు అయిదో తరగతి చదువుతున్న చింటూగాడు. శ్రావ్య ఆఫీసు కెళ్లిపోయింది. ఏడాదిన్నర పాపకి అమ్మ బాత్రూంలో స్నానం పోస్తోంది. దాని ఏడ్పుతో ఇల్లంతా దద్దరిల్లుతోంది.

"కిలోమీటర్ దాకా... వూరికే నడవటమెందుకురా. ఆటోలో వెళ్లు" అన్నాన్నేను.

"అవున్రా... ఆటోలో వెళ్లు" అన్నాడు నాన్న.

"వాడికి తాతయ్య చిటికెన వేలు పట్టుకొని... దార్లో ఆయన కొనిచ్చే చాక్లెట్ తింటూ బజార్లో కన్పించే ప్రతిదాని మీద ప్రశ్నలేస్తూ... వెళ్లటం వాడికలవాటు. అందుకే ఆటోకన్నా నడవటమే ఇష్టపడతాడు" సుకుమార్‌తో చెప్పాను.

"సరేరా... నే వెళ్తాను. రేపట్నించి అన్ని చానల్స్‌లోనూ యాడ్ వస్తుంది"

అంటూ లేచాడు.

అమ్మ చంటిదాన్ని టవల్‌తో తుడిచి సాంబ్రాణి పొగ వేస్తూ "కూచోవయ్యా కుమారు... ఎప్పుడొచ్చావ్. కాఫీ పెట్టుకొస్తాను" అంది.

"వద్దమ్మా... చాలా అర్జెంట్ పనులున్నాయి" అంటూ వెళ్లి పోయాడు. నేను ఆఫీస్‌కి తయారయ్యాను. అమ్మ ఏం మంత్రం వేసిందోగాని చంటిది టక్కున ఏడ్పు మానేసి నిద్రపోయింది.

చింటూగాడు ఆటోలో వెళ్లనని మారాం చేస్తున్నాడు. నాన్న మాత్రం వాన్ని ఈసారి కొంచెం విసుక్కొని 'ఆటోలోనే వెళ్లురా...' అంటూ తన గదిలోకి వెళ్లిపోయాడు.

నాకేం అర్థం కాలేదు... వాడు ఏడుస్తూ గేటు దాటిపోయి ఆటో ఎక్కాడు.

xxx xxx xxx

నాలుగైదు రోజుల తర్వాత... ఆ రోజు రాత్రి... డైనింగ్ టేబుల్ దగ్గర అన్నం తింటూ... నాన్న సడెన్‌గా చెప్పిన మాట విని అందరం షాకయ్యాం.

"నేను వారంలోగా ఓల్డేజి హోంకి వెళ్లాలనుకుంటున్నాను. సావిత్రి నీ నిర్ణయం కూడా చెప్పు" అని అమ్మనుద్దేశించి కూడా అన్నాడు.

"మీకేమన్నా పిచ్చా...??" తినటం మర్చిపోయి అరచినంత పని చేసాను నేను. "అదేంటి ఇక్కడ మీకు ఏం తక్కువైంది... మా పరువు తీయడానికి కాకపోతే..." శ్రావ్య కోపంగా అంది.

"మీకిదేం పోయేకాలం...?" అమ్మ కూడా ఆశ్చర్యంగా అడిగింది.

"దీనిమీద మీరంతా అనవసర రాద్ధాంతం చేయటం నాకిష్టంలేదు. సావిత్రి నీకిష్టమైతే రావచ్చు... లేకుంటే లేదు. నేను మాత్రం వారంలోపు వెళ్లిపోతాను. ఇందుకు మానసికంగా సిద్ధమయ్యే చెప్తున్నాను" దృఢంగా చెప్పారు నాన్న.

ఇల్లంతా నిశ్శబ్దమైపోయింది.

తర్వాత శ్రావ్య అంది.

"ఏ ఓల్డేజ్ హోంలోనైనా నెలకి కనీసం ఆరువేలైనా కట్టాలి. మీరు వ్యవసాయం చేసారు తప్ప...చదువు కొన్నా కూడా ఉద్యోగం చేయలేదు. కనీసం మీకు పెన్షన్ కూడా రాదు. నెలకి ఆరువేలు మీకోసం కట్టే స్థోమత మాకు లేదు" నిష్కర్షగా చెప్పింది.

నాకైతే అయోమయంగా తోచింది.

"నాకు నెలనెలా ఏం కట్టాల్సిన అవసరం లేదు. ఒక ఓల్డేజి హోంలో మోటివేటర్‌గా జాయినవుతున్నాను" అన్నాడు.

"మోటివేటరా... అదేంటి?" అన్నాను మరింత అయోమయంగా

"నెలలో ఒక వృద్ధున్ని హోంలో చేర్పిస్తేచాలు..." అంటూ చేయి కడుక్కొని లేచి వెళ్లిపోయారు. మరో మాటకు అస్కారమివ్వకుండా...

"అమ్మా... ఏంటే ఇది" అన్నాను కోపంగా.

"ఈయనకేదో పిచ్చి పట్టినట్టుంది.... నే చెప్తానుండు" అంటూ అమ్మకూడా వెళ్లింది. శ్రావ్యకు కంపరమెత్తినట్టుంది.

"ముసలాయన... ఆయనకే అంత రోషముంటే ఎలా? వెళ్తే వెళ్లనివ్వండి. ఒకరి ఖర్చయినా తగ్గుతుంది" అంది గట్టిగానే.

ఆ రాత్రంతా నేను నిద్రపోలేదు.

మర్నాడు... లేవగానే అమ్మనడిగాను...

"ఆయన మొదట్నించీ మొండి మనిషిరా... ఆయన కిష్టమైన రీతిలో ఆయన్ని బతకనిద్దాం" అంది బాధగా.

ఈ మాట... మరింత షాకయింది నాకు...

ఆయనెందుకీ నిర్ణయం తీసుకున్నారు... ఆఫీసులో కూడా ఆలోచన...

xxx xxx xxx

అనుకున్నట్టుగానే... అయిదు రోజులు గడవగానే ఆయన తయారయ్యారు. అమ్మ ఏడ్చింది. నేను మూగవాన్ని అయ్యాను. శ్రావ్య పరువు గురించి ఆలోచించింది. ప్రతి ఆదివారం వస్తానని చింటూగానికి మాటిచ్చాడు.

నా భుజం తట్టి... "మీరేదో బాధ పడుతున్నారని ఇక్కన్నించి వెళ్లట్లేదురా... ఈ రోజుల్లో మీ ఇద్దరికీ సంపాదన అవసరమే... మీ విషయాలే మీరు మాట్లాడు కోవడానికి తీరిక వుండదు. మనవల్లకు కథలు చెపుదామన్నా... హోంవర్క్‌లతో

వాళ్లకీ ఓపిక వుండదు. మీ అభిమానం కోల్పోకుండా... మా ఆత్మాభిమానం దెబ్బ తినకుండా.... ఈ వయసుకి సరిపడే కొత్తగూడుని వెతుక్కోవల్సిన అవసరం వస్తోంది... అంతే..." అంటూ కదిలిపోయాడు.

దంతాలూడిపోయిన ఏనుగు వెళ్లిపోతున్నట్టే... నాన్న వెళ్లిపోయాడు.

నాకు రెండు రోజులు ఏదో వెలితిగా అన్పించింది. అమ్మకి రోజంతా చంటి దాంతోనే సరిపోతోంది. చింటూగాడు హోంవర్క్‌లో పడి తాతయ్యని గుర్తు చేయట్లేదు... శ్రావ్యనైతే మాట వరసకు కూడా గుర్తు చేయలేదు.

మొదటిసారిగా వెనక్కి తిరిగి చూసుకుంటే... అనుబంధాలు, ఆత్మీయతలు ఇంతగా సడలిపోయాయా అన్పించింది. ఇన్ని రోజులూ గుర్తించలేక పోయానా అని అన్పించింది.

ఆధారపడటం అనేది ఆయనకు నచ్చకపోయుండచ్చు... అప్పుడప్పుడూ ఏ నిర్లక్ష్యపు నీడలైనా ఇంట్లో కన్పించి వుండొచ్చు... తనూ, శ్రావ్య కొన్నిసార్లు విసుక్కొన్న సందర్భాలూ గుర్తొచ్చాయి. అవి ఆయన్ని బాధ పెట్టివుండొచ్చు.

ఆయనెలా వున్నారోనని చూడ్డానికి స్కూటర్‌మీద ఆఫీసు నించి సాయంత్రం హోంకి వెళ్లాను.

వాడిపోయిన పూల తోటలా... వుంది ఆశ్రమం.

ఏ ఒక్కర్ని కదిలించినా... కన్నీటి సముద్రాలు హోరెత్తుతాయేమో... సౌకర్యంగా వున్నా ఆనందంగా అన్పించలేదు...

నాన్నగారి గురించి అడిగితే... 'ఆయన మోటివేటర్‌గా జాయినయ్యారు కదా... సాయంత్రం ఏ గుడిలోనో, పార్క్‌లోనో ఎవరైనా వృద్ధుల్ని కలువడానికి వెళ్లుంటారు' అని చెప్పారు.

వెంటనే నెహ్రూ పార్క్‌కెళ్లాను. నేనూహించినట్టే నాన్న వున్నారు. పచ్చగడ్డిలో కూచొని మరో పది మందిదాకా వృద్ధులున్నారు. నాన్న చెప్పేది వింటున్నారు...

"మన ఇండియాలో పదికోట్ల మంది వృద్ధులున్నారు. మరో పదేళ్లలో పదిహేడు కోట్లకు చేరుతున్నారు. పట్టణాల్లో ఆరు శాతం, పల్లెల్లో ఎనిమిది శాతం ఒంటరిగా జీవిస్తున్నారు. నలభై అయిదు శాతం మంది నయం కాని జబ్బుల్తో జీవిస్తున్నారు. పట్టణాల్లో డెబ్బయిశాతం, పల్లెల్లో ముప్పయ్ నాలుగు శాతం వృద్ధులు ఆర్థికంగా బిడ్డలపై ఆధారపడ్డారు. అయితే మారుతున్న ప్రపంచం మన బిడ్డల్ని కూడా మానసికంగా దూరం చేసి సంపాదన వెంట పరుగులు తీయిస్తోంది. మనల్ని చూసుకోవడానికి వాళ్లకి వీలు లేకుండా చేస్తోంది. మననించే కాదు.... వాళ్ల వైపు నించి కూడా అర్థం చేసుకోవాలి. వాళ్ల బలవంతం మీద చేరాల్సి రావటం కంటే... స్వచ్ఛందంగా వృద్ధాశ్రమాల్లో చేరటం మంచిది..." ఆయన చెప్పటం ఆపారు.

చాలా మంది వృద్ధుల కళ్లల్లో ఏవో నీలినీడలు కదలాడాయి.... వృద్ధాప్యం తీసుకొచ్చిన శారీరక బాధలకంటే... గుండెని గాయపర్చే సమస్యలు, సంఘటనలు ఎన్నెన్నో కదిలిపోయాయి.

ఒక ముసలాయన చెప్పాడు...

"వృద్ధాప్యం మీద పడుతుంటే... దాంతోపాటు అందరి ఛీత్కారాలకు దూరంగా బతికేలా మానసికంగా సిద్ధపడాలంటారు"

"అది సాధ్యమంటారా?" అన్నాడొకాయన.

"ఎన్నో జీవితానుభవాలు మోసిన వాళ్లం... అదో లెక్కా?" అన్నాడు మరో వృద్ధుడు. "సిద్ధపడకపోతే ఈ వృద్ధాప్యం మరింత భారమయ్యేటట్లుంద. నా ముగ్గురు కొడుకుల ఇళ్లల్లో వంతులవారీగా తిరగాలంటే నామోషీగా వుంది. నాలుగు నెల్లకోసారి మారే ఆహారపు అలవాట్లు నన్ను రోగాల పాల్జేస్తున్నాయి. ఆహారం పోనీ... చిటికెడంత ఆప్యాయత దొరకట్లేదు..." గొంతు పూడుకుపోయింది.

"ప్రపంచీకరణ అనేది మనిషి అనుబంధాల మీద బాగా దెబ్బకొడుతోంది. ముఖ్యంగా ఆ దెబ్బకు మన దేశపు వృద్ధులం విలవిలలాడుతున్నాం..."

"మరో ఇరవై ఏళ్ల తర్వాత... అరవై అయిదేళ్లు రాగానే తప్పనిసరిగా వృద్ధాశ్రమాలకు తరలించాలనే చట్టాలు వస్తాయని అంచనా వేస్తున్నారు"

"ఇప్పుడు కొడుకుల్ని ఓల్డేజి హోంలో వేస్తున్నందుకు తిడుతున్నారు. అప్పుడు వేయకపోతే తిడతారు" ఒక వృద్ధుడు నవ్వి చెప్పాడు.

"అప్పుడు వృద్ధాశ్రమంలో వేయని కొడుకుని.. తల్లిదండ్రులందు దయలేని పుత్రుండు అని పిలవాలి" మరో వృద్ధుడు వేసిన జోక్‌కి పార్క్ నిండా బోసి నవ్వులు విరబూసాయి.

అక్కడ బాధల్ని పంచుకుంటున్నారు...

నవ్వుకుంటున్నారు... చెమర్చిన కళ్లలోని కాంతుల్ని తడుముకుంటున్నారు... తెగిపోయిన ఆత్మీయతలు, అనుబంధాల్లో బిడ్డల్ని తిట్టుకోవటం కన్నా... కాలాన్నే తిట్టుకుంటున్నారు...

నాకైతే... ఒక కొత్త ప్రపంచానికి వ్యూహాల్ని రచిస్తున్న రూప కర్తల్ని చూస్తున్నట్టుగా అన్పించింది.

పురాణాల్లోని వాన ప్రస్థాశ్రమాన్ని పునర్ నిర్మించుకుంటున్న శ్రమ జీవుల్లా అన్పించింది.

నాన్న కంట్లో పడకుండా... చెట్టు చాటునించి వెళ్లిపోతున్న నేను ఆ సమావేశంలో వెనుకగా కూచున్న ఆమెని చూసి ఆశ్చర్యపోయాను...

ఆమె... అమ్మ!!!!

xxx xxx xxx

నాన్న కన్పించని లోటు కావచ్చు... శ్రావ్యతో వచ్చిన మాట పట్టింపు కావచ్చు... నాన్న దార్లోనే అమ్మకూడా వెళ్లిపోయాక... నెల వరకూ నిస్పృహలో కూరుకు పోయాను. వారానికోసారి ఆఫీసునించి వెళ్లి చూసి రావటమో... చింటూగాడ్ని తీసుకొని వెళ్లి ఆదివారాలు గడిపి రావటమో జరుగుతోంది.

అమ్మలేని లోటు... పని పరంగా శ్రావ్యమీదే ఎక్కువ పడింది. చంటిదాన్ని తీసుకొని ఆఫీస్‌కి వెళ్లి రావటం నరకమైపోయింది. ఒకసారి హోమ్‌కి వెళ్లి శ్రావ్య బ్రతిమాలినా అమ్మ రాలేదు.

రెండు నెలలు కాగానే... మళ్లీ రొటీనైపోయింది.

ఆ రోజు...

సాయంత్రం కారుమబ్బులు పట్టి కుండపోతగా వర్షం మొదలైంది. ఏకధాటిగా రెండు రోజులు వరుసగా కురుస్తూ జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. మూడో రోజున కూడా భారీ వర్షం....

రాత్రి పదిన్నరయింది....

పొద్దున్నే పోయిన కరెంటు మళ్లీ రాలేదు. నాకు శ్రావ్యకు చంటిదాన్ని నిద్ర పుచ్చటం కష్టమై పోయింది.

దానికి కనీసం బెడ్ ల్యాంప్ అయినా వుండాలి... చార్జింగ్ లైట్‌కి ఆడుకుంటుందల్లా అది పవర్ తగ్గి ఆగిపోగానే భయంగా ఏడ్వటం మొదలెట్టింది.

చీకటిని చూస్తే... వెక్కి వెక్కి ఏడుస్తుంది.

అదో రకం ఫోబియా అని చెప్పాడు డాక్టర్. 'పెరిగి పెద్దదవుతుంటే తగ్గిపోతుంది కానీ... అంతవరకూ ఈ పాపనెప్పుడూ చీకట్లో పడుకోబెట్టొద్దు... ఇది కొంచెం సీరియస్ విషయమే... బాగా భయపడితే ఏడ్చి ఏడ్చి... ప్రాణాలు పోవచ్చు' అని కూడా చెప్పాడు.

కాని... ఇన్ని రోజులూ ఆ ప్రాబ్లెం ఎదురుకాలేదు.

చార్జింగ్ లైట్లు రెండున్నా.... అవి గంటన్నరసేపు కూడా వెలుగలేకపోయాయి. చంటాదాని ఏడ్పు... ఎక్కువయింది.

అగ్గిపుల్ల గీసిన వెంటనే... ఆ వెలుతురికి ఏడ్పు ఆపేస్తోంది. అది ఆరిపోయి చీకటి కమ్ముకోగానే... మళ్లీ భయంగా ఏడుస్తోంది.

ఆ చీకట్లో ఏం చేయాలో తోచట్లేదు... బయటికి వెళ్లలేనంత వర్షం... క్యాండిల్స్ కోసమైనా తెగించి వెళ్దామన్నా... మూడ్రోజుల భారీ వర్షానికి ఏ షాపులూ తీసి వుంటాయన్న నమ్మకం లేదు... అందులోనూ ఇంత రాత్రి....

రాత్రి... ఒకటింబావు దాటుతోంది....

బయట హోరున వర్షం... చీకటి... ఆ చలిలో కూడా మాకు ముచ్చెమటలు పోసాయి. పాపకి ఏడ్చి... ఏడ్చి... గొంతులో వెక్కిల్లు వస్తున్నాయి.

శ్రావ్య ఏడ్వటం మొదలెట్టింది... చింటూగాడు నన్ను గట్టిగా పట్టుకున్నాడు.

ఇల్లు దద్దరిల్లిపోయేలా ఏడ్పు... వెక్కిల్లు...

నేను కూడా వణికిపోయాను.

సడెన్‌గా చింటూగాడు “డాడీ... నా స్కూల్ బ్యాగెక్కడ?” అన్నాడు. చీకట్లోనే నా చెయ్యి వదిలి తడుముకుంటూ వెళ్లి షెల్ఫ్‌లో వాడి బ్యాగ్‌ని దొరకబుచ్చుకొని పుస్తకాలన్ని కింద పడేసి చీకట్లోనే వెతుకుతున్నాడు.

కాసేపటి తర్వాత... “మమ్మీ... దొరికింది” అంటూ తడుముకుంటూ వచ్చి మెత్తటి వుండని శ్రావ్య చేతిలో పెట్టాడు.

"ఏమిట్రా...అవి?" అన్నాను.

"మొన్న స్కూల్ నించి నానమ్మ దగ్గరికెళ్లాం కదా... హోంలో ఖాళీగా వుండలేక వత్తులు చేస్తుందట. మీ మమ్మీకి ఓ వత్తుల కట్ట ఇవ్వరా...ఎప్పుడైనా పనికొస్తుంది అని ఇచ్చింది" అని చెప్పాడు.

శ్రావ్య ఆ చీకట్లోనే తడుముకుంటూ ఓ గిన్నెని తీసి దాంట్లో నూనె పోసి వత్తులేసి అంటించింది.

ఒక్కసారిగా... ఇల్లంతా పరుచుకున్న వెలుతురు....

ఊపిరి పీల్చుకున్నాం!!

"నానమ్మకి థాంక్స్" చింటూ గంతులేసాడు.

చంటిదాని ఏడ్పు క్రమంగా తగ్గింది... వెక్కిల్లు తగ్గిపోయి... అరగంటలో నిద్ర పోయింది. చింటూ కూడా నిద్రపోయాడు.

దీపం ఆరిపోకుండా... వత్తులేసుకుంటూ కూచున్నాం.

తెల్లారింది....

సెల్‌ఫోన్ మోగింది... హలో అన్నాను...

"మీ అమ్మగారు పోయారు సార్..." ఆశ్రమం నించి చెప్పారు.

నిశ్చేష్టుణ్ణయ్యాను...

అప్పటికి... వత్తులైపోయి దీపం ఆరిపోయింది !!

*